క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు పొంగళ్లు



ప్రత్యేకాలంకరణలో పోలేరమ్మ

పొదలకూరు: పట్టణంలోని నాయీ బ్రాహ్మణులు మంగళవారం భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ తల్లి ఆలయంలో పొంగళ్లు పెట్టారు. తమ ఇళ్ల వద్ద నుంచి పొంగలి పూజా సామగ్రి బుట్టలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం పొంగళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



పొదలకూరు: పట్టణంలోని గేట్ సెంటర్, ఆచారి వీధి, ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పొదలకూరు కమిటీ అధ్యక్షుడు జి.పెంచల నరసయ్య, సభ్యులు సరోజనమ్మ, కిష్టయ్య, కొండయ్య, మధు, కిశోర్, పి.జాహ్నవి పాల్గొన్నారు.

వృద్ధులకు దంత వైద్య పరీక్షలు



పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మి వృద్ధాశ్రమంలో మంగళవారం సీహెచ్‌సీ దంత వైద్యురాలు వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి ఉచితంగా టూత్ పేస్టులు, మౌత్ వాష్‌లు అందజేశారు.

కార్పొరేషన్ కార్యాలయ ఎదుట నిరసన



నెల్లూరు(బారకాసు): మున్సిపల్ కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయ ఎదుట నిరసనను మంగళవారం చేపట్టిన అనంతరం వారు మాట్లాడారు. ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలు, కాంట్రాక్టర్లకు అప్పగిస్తే ఊరుకునేదిలేదని స్పష్టం చేశారు. 60 ఏళ్లు నిండాయనే నెపంతో నగరపాలక సంస్థలో పనిచేస్తున్న 93 మంది ఆప్కాస్ ఉద్యోగులను హఠాత్తుగా నిలిపేయడం దారుణమని చెప్పారు. సమస్యలపై నిర్లక్ష్య వైఖరిని వీడకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని తెలిపారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ చెన్నుడికి వినతిపత్రాన్ని అందజేశారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి



రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రంలోని రజకుల సమస్యలను కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రేకులగుంట అంకయ్య డిమాండ్ చేశారు. జేమ్స్ గార్డెన్‌లోని సీఐటీయూ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏపీ రజక వృత్తిదారుల సంఘ ఆధ్వర్యంలో నేరేళ్ల శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంకయ్య మాట్లాడారు. రజకుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర మహాసభలను కొండపల్లిలో ఈ నెల 20, 21న నిర్వహించనున్నామని పేర్కొన్నారు. గత ఎన్నికల సమయంలో వివిధ హామీలను టీడీపీ గుప్పించిందని, అయితే ప్రభుత్వం ఏర్పడి పది నెలలవుతున్నా, నేటికీ దేన్నీ అమలు చేయలేదని విమర్శించారు.

పన్నుల వసూళ్లు భేష్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థలో పన్నుల వసూళ్లలో విశేష కృషి చేసిన అధికారులు, సిబ్బంది సేవలను కమిషనర్ సూర్యతేజ మంగళవారం ఒక ప్రకటనలో అభినందించారు. గతేడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు రూ.77,76,09,759 మేర వసూలు చేశారని వెల్లడించారు. ఒక్క సోమవారమే రూ.2.85 కోట్లను వసూలు చేశారన్నారు. గతేడాదితో పోలిస్తే ఇది రూ.11.38 కోట్లు అదనమని తెలిపారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు



మనుబోలు: పరీక్షలు ముగిసిన ఆనందంలో విద్యార్థినులు



ముత్తుకూరు: పరీక్షల కేంద్రం వద్ద ఇలా..

ముత్తుకూరు: పదో తరగతి పరీక్షలు మంగళవారం సోషల్ స్టడీస్ పరీక్షతో ప్రశాంతంగా ముగిశాయి. మార్చి 17వ తేదీన ఎగ్జామ్స్ ప్రారంభమైన విషయం తెలిసిందే. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముగియడంతో విద్యాశాఖాధికారులు ఊపిరి పీల్చుకొన్నారు. చివరిరోజు పరీక్షలు ముగియగానే విద్యార్థులు కేరింతలు కొడుతూ వెలుపలకు వచ్చారు. ముత్తుకూరు హైస్కూల్, గురుకుల పాఠశాల, వీబీఆర్ హైస్కూల్, పిడతాపోలూరు రత్నం హైస్కూల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. చివరి రోజు 682 మందికి గానూ 676 మంది హాజరయ్యారు.

• మనుబోలు: మండలంలో పదో తరగతి ఎగ్జామ్స్ మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. వీరంపల్లి, మడమనూరు, అక్కంపేట, బద్దెవోలు, మనుబోలు బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతోపాటు సుస్వత ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులకు మనుబోలు జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. చివరి రోజు సోషల్ పరీక్షకు బాలుర పాఠశాలలో 126 మందికి గానూ 123 మంది, బాలికల పాఠశాలలో 91 మందికి గానూ 89 మంది హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్లుగా కాంతారావు, శ్రీనివాసులు, డిపార్ట్‌మెంట్ అధికారులుగా శ్రీహరి, వాసుదేవరావు వ్యవహరించారు. పరీక్షల సందర్భంగా ఎస్సై శివరాకేష్ జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేశారు.

• పొదలకూరు: పదో తరగతి పరీక్షలు పూర్తయిపోవడంతో విద్యార్థుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. పొదలకూరు విద్యార్థులు సంతోషంగా ఇళ్ల బాట పట్టారు.



కొడవలూరు: బుచ్చిరెడ్డిపాళెంలో..

• కొడవలూరు(బుచ్చిరెడ్డిపాళెం): పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పట్టణంలోని ఐదు కేంద్రాల్లో పరీక్షలను జరిపారు. పరీక్షలు పూర్తవడంతో విద్యార్థులు కేరింతలు కొట్టారు.

గ్రామదేవతలకు పూజలు

ముత్తుకూరు: మండలంలోని ముత్తుకూరులో మంగళవారం గ్రామదేవతలైన మారెమ్మ సహిత తాళ్ల పరమేశ్వరి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో చద్ది, సలిపిండి, పానకాలు సమర్పించి, మొక్కలు తీర్చుకొన్నారు. స్థానిక గొల్లవీధిలో జరిగిన ఈ వేడుకల సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తూ భక్తులు సందడి చేశారు. అనంతరం జరిగిన గంగపెట్టె గ్రామోత్సవంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈదూరు రామమోహన్‌రెడ్డి, కె.రవీంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డితోపాటు పెద్ద గొల్ల నాగేశ్వరావు, సుంకర వెంకటేశ్వర్లు, శ్రీనివాస యాదవ్ తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న గ్రామస్తులు

అనంతరం తాళమ్మ వీధిలో జరిగిన ప్రత్యేక వేడుకలకు వందల సంఖ్యలో జనం హాజరయ్యారు.

మైపాడులో సందడి



ఇందుకూరుపేట: ప్రముఖ పర్యాటక కేంద్రం మైపాడు సాగర తీరం సందర్శకులతో సందడిగా మారింది. పెద్ద సంఖ్యలో మంగళవారం తరలివచ్చి సేదతీరారు. దీంతో మైపాడు, నెల్లూరు ప్రధాన రహదారి వాహనాల రాకపోకలతో రద్దీగా మారింది. ట్రాఫిక్‌కు అంతరాయం తలెత్తకుండా ఎస్సై నాగార్జునరెడ్డి పర్యవేక్షించారు.

డీజిల్‌ను తాగేస్తున్నారు..!



• దొంగచాటుగా తీసి.. గోల్‌మాల్
• బయట విక్రయించి సొమ్ము చేసుకుంటూ..
• లెక్కల పరిశీలనలో 30 లీటర్ల తేడా
• నగరపాలక సంస్థలో ఇదీ తీరు

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థలో డీజిల్‌ను కొందరు అక్రమార్కులు తాగేస్తున్నారు. వాహనాల నుంచి దొంగచాటుగా తీసి బయట విక్రయించి భారీగా ఆర్జిస్తున్నారు. ఫలితంగా వినియోగమయ్యే దానికంటే అధికంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

జరగాల్సింది ఇలా..

నెల్లూరు నగరపాలక సంస్థకు సంబంధించిన చెత్త తరలించే వాహనాలు, ఫాగింగ్ యంత్రాలు, కొందరు అధికారుల కార్లకు అవసరమైన డీజిల్‌ను వినియోగిస్తారు. ఇక్కడి వెహికల్ షెడ్‌లోనే డీజిల్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా వాహనాల్లో నింపి, ఏ రోజు లెక్కలను అదే రోజు పరిశీలిస్తారు.

నిత్యం 1100 లీటర్ల వినియోగం

మొత్తం 140 వాహనాలకు గానూ 1100 లీటర్ల డీజిల్‌ను నిత్యం వినియోగిస్తారు. చెత్తను తరలించే వాహనాల నుంచి డంపింగ్ పూర్తయ్యాక వీటిని ఆయా ప్రదేశాల్లో ఉంచుతారు. ఆ సమయంలోనే సంబంధిత వాహనాల డ్రైవర్లు కొంత మేర డీజిల్‌ను బయటకు తీసి విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా పలు వాహనాల నుంచి తీసిన డీజిల్‌ను క్యాన్‌లో నింపి, బయట విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని సమాచారం. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో అంతా ఇష్టారాజ్యమవుతోంది.

మరోవైపు మార్చిలో ఎంత డీజిల్ వినియోగమైందనే లెక్కలను సంబంధిత అధికారులు మంగళవారం పరిశీలించగా, 30 లీటర్ల తేడాను గుర్తించారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరపగా, అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

వారం రోజులకు సరిపడా..

క్లాప్ చెత్త వాహనాలకు మాత్రం వారం రోజులకు సరిపడా డీజిల్‌ను నింపుతారు. ఈ వాహనాలు 25 కిలోమీటర్లలోపే నిత్యం తిరుగుతాయి. కొన్ని సందర్భాల్లో ఇంతకంటే తక్కువా తిరిగే అవకాశమూ ఉంది. ఇలాంటి సమయాల్లో ఒకట్రెండు లీటర్ల డీజిల్‌ను బయటకు తీస్తుంటారు. కొన్ని వాహనాలకు లెక్కకు మించి డీజిల్ వినియోగమైందనే అంశాన్ని అధికారులు గుర్తించారు. ఈ విషయమై వెహికల్ షెడ్‌లోని డీజిల్ ట్యాంక్ వద్ద ఉంటున్న వ్యక్తిని నిలదీయగా, అసలు విషయం చెప్పారు. నగరపాలక సంస్థలో కీలకంగా వ్యవహరిస్తున్న ఓ ఉద్యోగికి 30 లీటర్లను ఇచ్చానని తెలిపారు.

అయితే సదరు అధికారి ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో సీరియస్ అయ్యారని సమాచారం. కాగా ఈ విషయమై వెహికల్ షెడ్ నిర్వహణను పర్యవేక్షిస్తున్న ఏఈ అంజిరెడ్డిని ఫోన్లో సంప్రదించగా, డీజిల్ వినియోగంలో ఎలాంటి తేడాను గుర్తించలేదని చెప్పారు. వినియోగానికి సంబంధించిన రీడింగ్‌ను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని, డీజిల్‌ను చోరీ చేసి విక్రయించారని తెలిస్తే తగు చర్యలు చేపడతామని చెప్పారు. అయితే అలాంటిదేమీ జరగలేదని బదులిచ్చారు. కమిషనర్ సీరియస్ అయిన ఉదంతం వేరే విషయమని ఆయన చెప్పారు.

క్రైస్తవ సంఘాల నిరసన



కొడవలూరు (బుచ్చిరెడ్డిపాళెం): పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పద మృతిపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీని క్రైస్తవ సంఘాలు మంగళవారం నిర్వహించాయి. పట్టణంలోని అంబేడ్కర్ భవన్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. సమగ్ర విచారణ జరిపి.. క్రైస్తవ సమాజానికి రక్షణ కల్పించాలి అంటూ నినాదాలు చేశారు. అనంతరం కొవ్వొత్తులను వెలిగించి.. పాస్టర్ ప్రవీణ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

చికెన్ వ్యర్థాలను తరలిస్తే చర్యలు

కోవూరు: చికెన్ వ్యర్థాలను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్లో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. రెండు వారాల వ్యవధిలో నాలుగు వాహనాలను సీజ్ చేసి కేసులను నమోదు చేశామన్నారు.

ఈ - కేవైసీని విధిగా చేయించుకోవాలి

కోవూరు: రేషన్‌కార్డుదారులు ఈ - కేవైసీని తప్పక చేయించుకోవాలని తహసీల్దార్ నిర్మలానందబాబా కోరారు. పట్టణంలోని ఈ - కేవైసీ నమోదు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. రేషన్ డీలర్ల అసోసియేషన్ నేత కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు అవకాశం

కోవూరు: విద్యుత్ అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించుకునే అవకాశాన్ని ఎస్పీడీసీఎల్ కల్పించిందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈఈ రమేష్‌రెడ్డి కోరారు. పట్టణంలోని కార్యాలయంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. ఈ అవకాశం గృహ వినియోగదారులకే వర్తించనుందని పేర్కొన్నారు. 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకునే అవకాశం జూన్ 30 వరకు అమల్లో ఉంటుందన్నారు. పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దాడి ఘటనపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో నిందితుడిపై కేసును చిన్నబజార్ పోలీసులు నమోదు చేశారు. వివరాలు.. ఖుద్దూస్‌నగర్‌లో నివాసం ఉంటున్న సిరాజ్‌కు పక్క వీధిలో ఉండే నిహాల్‌తో ఫోన్ విషయమై మనస్పర్థలున్నాయి. ఈ నేపథ్యంలో షాదీమంజిల్ సమీపంలోని ఓ టీ దుకాణం వద్ద సిరాజ్ సోమవారం రాత్రి ఉండగా, దాడి చేసి నిహాల్ గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

టెన్నిస్‌బాల్ క్రికెట్ జట్ల ఎంపికలు నేడు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): టెన్నిస్‌బాల్ క్రికెట్ అండర్ – 19 బాలబాలికల జిల్లా జట్లను నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బుధవారం ఎంపిక చేయనున్నామని అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారు పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో ఈ నెల ఐదు, ఆరు తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అండర్ – 19 పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారని చెప్పారు. వివరాలకు 94935 82143, 91829 10893 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పారదర్శకంగా పింఛన్ల పంపిణీ

పొదలకూరు: అవినీతికి తావు లేకుండా జిల్లాలో పారదర్శకంగా పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి పేర్కొన్నారు. పొదలకూరు పంచాయతీలో మంగళవారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. వెంకటేశ్వరపురం కాలనీలో సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రూ.132 కోట్లను 3.6 లక్షల మంది లబ్ధిదారులకు ప్రతినెలా ఒకటో తేదీన అందించేలా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో సచివాలయ సిబ్బందిచే లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి నగదు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం చిన్నయ్య, సీసీ దయాకర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



పింఛన్ అందజేస్తున్న పీడీ

రూ.2.58 కోట్లతో నీటితొట్టెల నిర్మాణం

మనుబోలు: వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటితొట్టెల నిర్మాణానికి రూ.2.58 కోట్లు మంజూరైనట్లు డ్వామా పీడీ గంగాభవాని తెలిపారు. మండలంలోని జట్ల కొండూరు గ్రామంలో పశువులు, గొర్రెలు, మేకల కోసం నీటితొట్టి నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 984 నీటి తొట్టెల కోసం ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ఒక్కో దాని నిర్మాణానికి రూ.28 వేలు చెల్లిస్తామని, వారంలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రైతులు తమ పొలాల్లో నీటి గుంతలు తవ్వించుకునేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో 7,500 వర్షపు నీటి గుంతలను తవ్వించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పనులు జరిగే చోట నీడ కోసం షెడ్లను ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి వసతి కల్పించడంతోపాటు కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జలజాక్షి, ఏపీఓ రాజమ్మ, టీఏ గుర్రప్ప, మాజీ సర్పంచ్ వెందోటి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న పీడీ తదితరులు

ఉపాధి పనుల్లో అవకతవకలు



ప్రజా వేదికకు హాజరైన అధికారులు

• రూ.13.36 లక్షల రికవరీకి ఆదేశం
• పీఆర్ ఏఈకి రూ.12.36 లక్షలు
• నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్లపై రూ.77,661

కొడవలూరు: మండలంలో ఉపాధి పనులపై జరిగిన సామాజిక తనిఖీలో రూ.13.36 లక్షల అవకతవకలు జరిగినట్లు నిర్ధారించి బాధ్యులపై ఆ మొత్తం రికవరీకి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో డ్వామా పీడీ బి.గంగాభవాని ఆధ్వర్యంలో సామాజిక తనిఖీపై మంగళవారం ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని పాతవంగల్లు, పెయ్యలపాళెం, వెంకన్నపురం, యల్లాయపాళెం గ్రామాల్లో మస్టర్‌లు, కొలతల్లో రూ.77,661 మేర అవకతవకలు జరిగినట్లు తనిఖీలో నిర్ధారించడంతో సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లు ఆ మొత్తం చెల్లించాలని ఆదేశించారు. అదేవిధంగా గతంలో ఇక్కడ పనిచేసిన పీఆర్ ఏఈ తాతారావు రూ.12.36 లక్షలకు రికార్డులు చూపకపోవడంతో ఆయన్ను ఆ మొత్తం చెల్లించాలన్నారు. మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత విషయమై పీడీ మాట్లాడుతూ కొందరు స్వచ్ఛందంగా వైదొలగడం జరిగిందన్నారు. ఆ స్థానంలో కొత్తవారిని నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఏవీ సుబ్బారావు, ఈఈ వి.సతీష్‌బాబు, డీవీఓ డి.విజయలక్ష్మి, ఏపీడీ మృదుల, ఎస్ఆర్‌పీ డి.కన్నారెడ్డి, ఏపీఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా



నెల్లూరు(అర్బన్): సైదాపురం మండలంలోని ఊటుకూరులో దళితులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేసి.. భూములకు యాజమాన్య హక్కులను కల్పించాలని అఖిల భారత రైతు కూలీ సంఘ జిల్లా కమిటీ అధ్యక్షుడు పోలయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద ధర్నాను పలువురు దళితులు మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్వే నంబర్లు 359, 356లోని ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సర్వే చేయించాలని కోరారు. పెత్తందారులు, బడా భూస్వాముల చెరలో ఉన్న ప్రభుత్వ, మిగులు, పోరంబోకు భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నిరుపేదలకు పంచాలని కోరారు. భూములను పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్న దళితులపై అక్రమ కేసులు, పోలీసుల వేధింపులు ఎక్కువయ్యాయని ఆరోపించారు. అనంతరం కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు రమేష్, ప్రగతిశీల మహిళా సంఘ నేతలు మమత, అనూష, నాగమణి, రైతు కూలీ సంఘ నేతలు హరిబాబు, పెంచలయ్య, కోటయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు జరపాలి



మాట్లాడుతున్న ఆనంద్

నెల్లూరు(అర్బన్): జిల్లాలో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టేందుకు గానూ స్కానింగ్ కేంద్రాలపై సంబంధిత అధికారులు ఆకస్మిక తనిఖీలను చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. పీసీ, పీఎన్డీటీ చట్టం అమలుపై కలెక్టరేట్లోని తన చాంబర్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అబార్షన్లు నిర్వహించకుండా గర్భస్థ శిశువులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కేసులతో పాటు కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు 50 ఆకస్మిక తనిఖీలను నిర్వహించామని డీఎంహెచ్ఓ సుజాత తెలియజేశారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఉమామహేశ్వరి, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ రామారావు, డెమో అధికారి కనకరత్నం, ఎన్జీఓ కవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెజ్లింగ్ జట్ల ఎంపికలు రేపు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రెజ్లింగ్ జిల్లా జట్లను నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గురువారం ఎంపిక చేయనున్నామని అసోసియేషన్ కార్యదర్శి నాగేంద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 20 ఏళ్లలోపు వారు అర్హులని, ఎంపికైన క్రీడాకారులు.. రాజమహేంద్రవరంలో ఈ నెల ఐదున నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారని చెప్పారు. వివరాలకు 94416 44761 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.